సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



దసరా శోభ

నూజివీడు పట్టణంలోని కోటమహిషాసుర మర్ధని అమ్మవారి ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. IIలో



ఎరల వాడకం.. రైతులకు లాభం

పంటపై ఆశించే పురుగుల నివారణకు రసాయన మందులపైన కాకుండా ఎరల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. IIలో



కంపు కొడుతున్న బస్టాండ్

తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ ప్రాంగణంలో అపారిశుధ్య పరిస్థితులు నెలకొన్నాయి. పలు పల్లపు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. IIలో

న్యూస్‌రీల్

భీమవరంలో టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

భీమవరం: ఏపీ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం భీమవరం పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో ప్రారంభమయ్యాయి. అండర్ -17, 19, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పోటీల కన్వీనర్ జీపీసీ శేఖర్ రాజు చెప్పారు.

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్



శ్రీవారి ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో నామమాత్రంగా భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీపై ఆదివారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. సెలవు దినం కావడంతో ప్రతి ఆదివారం వేలాది మంది భక్తులు స్వామిని దర్శిస్తారు. అమావాస్య కావడంతో ఈ వారం స్వల్ప సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. దాంతో మధ్యాహ్నం వరకు ఆలయ పరిసరాల్లో నామమాత్రంగా భక్తులు సంచరించారు. ఆ తరువాత నుంచి దాదాపుగా అన్ని విభాగాలు భక్తుల లేక ఖాళీగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, ఉచిత ప్రసాద వితరణ క్యూలైన్లు, కల్యాణ కట్ట తదితర విభాగాలు భక్తులు లేక వెలవెలబోయాయి.

ఆటపాక కేంద్రంలో పర్యాటకుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రంలో బోటు షికారులో పక్షులను వీక్షిస్తున్న పర్యాటకులు

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామం ఆటపాక పక్షుల విహార కేంద్రంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. ఏలూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు విచ్చేశారు. బోటు షికారు చేస్తూ దగ్గరుండి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల కేరింతలను వీక్షించారు. సమీపంలో పక్షి నమూనా మ్యూజియంలో వివిధ రకాల పక్షుల విశేషాలను తెలుసుకున్నారు. చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఉల్లాసంగా గడిపారు. ఫారెస్టు డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ రంజిత్‌కుమార్ కొల్లేరు నైసర్గిక స్వరూపం, వివిధ రకాల పక్షుల విశేషాలను యాత్రికులకు వివరించారు. పర్యాటకుల కోసం ఇటీవల నూతన బోటును అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మరో రెండు బోట్లుకు మరమ్మత్తులు జరుగుతోన్నాయని తెలిపారు.

ఖరీఫ్‌లోనూ కోతే

- ధాన్యం కొనుగోలు 5 లక్షల మెట్రిక్ టన్నులేనా?
- దిగుబడి 8 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని అంచనా
- దాళ్వా మాదిరిగానే నష్టపోతామంటున్న రైతులు
- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు



వీరవాసరం మండలం తోకలపూడిలో ఈనిక పూర్తయిన విత్తన రకం పైరు

భీమవరం : సార్వా వరిసాగులో అనేక ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న రైతులు ధాన్యం అమ్మకాల సమయంలోనూ తిప్పలు తప్పవనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సార్వా సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా కేవలం 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించడం ఆందోళన కలిగిస్తోంది. సాగు సీజన్ ప్రారంభంలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామన్న ప్రభుత్వం వరినాట్లు పూర్తి అయిన తరువాత తీరికగా కొంతమంది రైతులకు మాత్రమే సొమ్ములు బ్యాంక్‌లో జమచేసింది. అప్పటికే సాగుకు అప్పులు చేసిన రైతులకు ప్రభుత్వ సాయం స్వాంతన చేకూర్చలేదు. వరి పైరుకు ఎరువులు వేయాల్సిన తరుణంలో యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. అనేక చోట్ల యూరియా కొరత కారణంగా ఎక్కువ రేటుకు కొనుగోలుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 20 మండలాల్లో సార్వా సీజన్‌లో సుమారు 2.18 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. కొన్ని చోట్ల ఇప్పటికే విత్తన రకం ఈనిక పూర్తిచేసుకోగా తాడేపల్లిగూడెం, తణుకు, గణపవరం, పెంటపాడు తదితర మండలాల్లో పైరు పొట్ట, ఈనిక దశలో ఉన్నాయి.

దాళ్వాలో 10 లక్షల టన్నుల దిగుబడి

దాళ్వా సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 9.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసి దానిలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల అవసరాలకు పోను 7.75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం కేవలం 6 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే లక్ష్యంగా నిర్ణయించడంతో ధాన్యం అమ్మకాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే అదునుగా కొంత మంది రైస్‌మిల్లర్లు, దళారులు రైతుల వద్ద ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టడంతో ప్రభుత్వం మరింత ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించింది. అప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుత సార్వా సీజన్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి రావచ్చునని ప్రభుత్వం కేవలం 5 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తే మిగిలిన ధాన్యం పరిస్థితి ఏంటిని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువగా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ముందుగానే నిర్ణయించడంతో దళారులు అవకాశంగా తీసుకుని ధాన్యం ధర మరింత తగ్గించే ప్రమాదముందని వాపోతున్నారు. పంట దిగుబడి అంచనాలకు అనుగుణంగా ముందుగానే ప్రభుత్వం ఎక్కువగా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పూర్తిగా ప్రభుత్వమే కొనాలి



రానున్న సార్వా పంట ధా**న్యాన్ని పూర్తిగా** ప్రభుత్వమే **కొనుగోలు చేసేలా** చర్యలు **తీసుకోవాలి. జిల్లాలో 2** లక్షల **ఎకరాలకుపైగా సార్వా** సాగు **చేసినందున దాదాపు 8** లక్షల **టన్నుల వరకూ ధాన్యం** దిగుబడి వచ్చే అవకాశం ఉం**ది. ఇలాంటి పరిస్థితుల్లో** ప్రభుత్వం కేవలం 5 లక్షల **మెట్రిక్ టన్నులు మా**త్రమే కొనుగోలు చేయాలనే **నిర్ణయం సరైనది కాదు.**

– గాదిరాజు రామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, భీమవరం

రైతులు తీవ్రంగా నష్టపోయారు



గత దాళ్వాలో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా ప్రభుత్వం 6 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి ముందుగా నిర్ణయించడంతో రైతులు రైస్ మిల్లర్లు, దళారులను ఆశ్రయించాల్సి వచ్చింది. దీంతో తక్కువ ధరకే ధాన్యం విక్రయించుకుని రైతులు నష్టపోయారు. రానున్న సార్వా సీజన్‌కు గత పరిస్థితి పునరావృతంకాకుండా రైతుల వద్ద ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

– ఎం.రామాంజనేయులు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎరువుల కొరతపై నిరసన



గూడెంలో నిరసన తెలుపుతున్న రైతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎరువుల కొరత నివారించాలని కోరుతూ ఆదివారం స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లోని ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ కార్యాలయంలో రైతులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, నాయకులు సిరపరపు రంగారావు, కసిరెడ్డి శివలు మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల కోటాను కేంద్రం నుంచి తెచ్చుకోకుండా రైతులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని వాపోయారు. మోసకారి మాటలతో ఎరువులు వాడకాన్ని తగ్గించుకుంటే బస్తాకు రూ.800 ఇస్తామని ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కొన్ని రాష్ట్రాలు పది శాతం తక్కువ ఎరువులకు ఆమోదించాయని, కానీ రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు నాయుడు 20 శాతం ఎరువులు తగ్గించుకోవడానికి రూ.500 కోట్లు కేంద్ర ప్రభుత్వం వద్ద ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. యూరియా వాడకం వల్ల క్యాన్సర్ వస్తుందని చెప్పడం ఏంటని ప్రశ్నించారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో తడిసిన ధాన్యం బస్తాలు



ఎల్.అగ్రహారంలో ఈదురు గాలులకు నేలకొరిగిన వరి

తాడేపల్లిగూడెం రూరల్: అకాల వర్షంతో మండలంలో పలు గ్రామాల్లోని ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ప్రధానంగా ఎల్.అగ్రహారం ఆర్ఎస్‌కే వద్ద నెట్టు కట్టిన ధాన్యం బస్తాలు, రాశులుగా పోసిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఉదయం నుంచి ఎండగా ఉండటంతో రైతు ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కించి, నెట్టుగా వేశారు. సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో ధాన్యం బస్తాలు తడిసి తీరని ఆవేదన మిగిల్చింది. ఏటా ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంట గట్టెక్కించుకునే క్రమంలో అకాల వర్షాలు రైతుపై కన్నెర్ర చేయడం పరిపాటిగా వస్తోంది. ఇటుకులగుంట, కుంచనపల్లి సబ్ స్టేషన్ సమీపంలోని వరి చేలు ఈదురు గాలుల ప్రభావానికి నేలకొరిగాయి. మరోవైపు మోదుగగుంట, అప్పారావుపేట, దండగర్ర, మాధవరం తదితర గ్రామాల్లో వర్షం జాడ లేదు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల రైతాంగం ఊపిరి పీల్చుకున్నారు. గత రెండ్రోజులుగా ఉదయం ఎండ, సాయంత్రం వర్షంతో ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతుఉన్నారు. శనివారం 75 కిలోల బస్తా ధాన్యం రూ.1200కి విక్రయించగా, ఆదివారం పది రూపాయలు తగ్గించి రూ.1190కు కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. ఒక్క రోజులోనే బస్తాపై రూ.10 తగ్గించి కమిషన్ వ్యాపారులు కొనుగోలు చేశారు. కడియద్ద గ్రామంలో ధాన్యాన్ని పరిశీలించేందుకు వచ్చిన క్రమంలో త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రకటించారు. అయితే, నేటికీ ఆచరణ సాధ్యం కాకపోవడంతో కమిషన్‌దారులు రైతుల నుంచి అయినకాడికి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

భారీ వర్షంతో ఇక్కట్లు

వీరవాసరం: వీరవాసరం మండలం వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మూడు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లోని డ్రెయిన్లు వర్షపు నీటితో నిండి కాలువలుగా మారాయి. ఈ వర్షాలు వరి రైతులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని పేర్కొంటున్నారు. రాయకుదురు–చింతల కోటి గరువు వెళ్లే ప్రధాన రహదారిపై రెండు భారీ కొబ్బరి చెట్లు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పలుచోట్ల విద్యుత్ స్తంభాలు గాలికి ఒరగడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. సంబంధిత శాఖ అధికారులు తక్షణం స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గూడెంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం పడింది. గంటకుపైగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం కురిసిన భారీ వర్షంతో సేద తీరారు. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. పలు ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో సాంకేతిక సమస్యలు, విద్యుత్ లైన్లలో సమస్యలు ఏర్పడ్డాయి. విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



చింతలకోటిగరువు -రాయకుదురు రోడ్డులో కూలిన కొబ్బరి చెట్లు



గూడెం 7వ వార్డులో నిలిచిన వర్షపు నీరు

శరన్నవరాత్రుల శోభ



శ్రీదేవి శరన్నవరాత్రులకు ఆలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా సిద్ధమయ్యాయి. విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి. కొల్లేటికోటలో కాంతులీనుతున్న పెద్దింట్లమ్మ ఆలయ దృశ్యమిది.

– కైకలూరు

2 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- 6న స్వామివారి తిరుకల్యాణం
- 7న రథోత్సవం



ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 2 నుంచి 9 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. వాటిని పురస్కరించుకుని ఉత్సవాల ఆహ్వాన పత్రికలను రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి వారి క్యాంపు కార్యాలయాల్లో ఆదివారం అందజేశారు. మిగిలిన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు అందించనున్నారు. ఇదిలా ఉంటే ఉత్సవ విశేషాలను ఈఓ మూర్తి విలేకర్లకు వెల్లడించారు. వైఖానస ఆగమాన్ని అనుసరించి పాంచాహ్నిక దీక్షతో ఈ ఉత్సవాలను 8 రోజుల పాటు అట్టహాసంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో శ్రీవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామోత్సవాలను, శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలను కనులపండువగా జరుపుతామన్నారు. అలాగే ఆలయ ముఖ మండపంలో స్వామివారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అక్టోబర్ 2 నుంచి 9 వరకు ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. యావన్మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని, స్వామివారిని దర్శించి తరించాలని కోరారు.

ఉత్సవాలు జరిగేదిలా..

- వచ్చేనెల 2న ఉదయం 9.30 గంటలకు శ్రీవారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేయడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఆ రోజు రాత్రి 7 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- 3న రాత్రి 9 గంటలకు ధ్వజారోహణ, అనంతరం హంసవాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- 4న ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- 5న ఉదయం 7 గంటలకు హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, అనంతరం వెండి శేష వాహనంపై గ్రామోత్సవం.
- 6న ఉదయం 7 గంటలకు సింహ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం, రాత్రి 8 గంటల నుంచి శ్రీ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం.
- 7న రాత్రి 8 గంటల నుంచి రథోత్సవం.
- 8న ఉదయం 10.30 గంటలకు చక్రస్నానం, రాత్రి 9 గంటలకు ధ్వజావరోహణ, అనంతరం అశ్వ వాహనంపై గ్రామోత్సవం.
- 9న ఉదయం 9 గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పవళింపుసేవ, శ్రీపుష్పయాగం కార్యక్రమాలు జరుగుతాయి. వీటితో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ఈ నిర్మాణాలకు మోక్షమెప్పుడో ?



పెనుగొండలో నిలిచిన సచివాలయ భవన నిర్మాణాలు



పెనుగొండలో కోడి పందేల దిబ్బలో పునాది దశలో ఉన్న సచివాలయం వద్ద పెరిగిన గుబురు పొదలు

పెనుగొండ: గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను రూపొందించి అమలు చేశారు. సచివాలయాలకు సొంత భవనాల ఏర్పాటుకు కోట్లాది రూపాయలు మంజూరు చేసి భవన నిర్మాణాలు చేపట్టారు. గత ప్రభుత్వంలో చాలా వరకూ పూర్తి కాగా కొన్ని నిర్మాణ దశలోనే ఉండిపోయాయి. వీటిపై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో 358 సచివాలయ భవనాలకు రూ.141.2 కోట్లు మంజూరు చేశారు. 298 ఆర్బీకేలకు రూ.65 కోట్లు, 214 హెల్త్ క్లినిక్‌లకు రూ.53.5 కోట్లు కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. వీటిలో 270 సచివాలయ భవనాలు, 211 రైతు భరోసా కేంద్రాలు, 96 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం పూర్తి కావడంతో వాటిల్లో సచివాలయ, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మిగతావి పురోగతిలో ఉన్నాయి. ఈ తరుణంలో ఎన్నికలు రావడంతో నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. నిలిచిపోయిన వాటిలో 20 శాతంకు పైగా తుది దశకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం వాటిపై శ్రద్ధ చూపించకపోవడంతో ఆయా భవనాల వద్ద గడ్డి, మొక్కలు మొలిచి చిట్టడివిని తలపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థపై శీతకన్ను వేయడంతో పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉండిపోయాయి.

సేవలూ అంతంత మాత్రమే

సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లతో ఎన్నో సేవలు అందేవి. సచివాలయాలు ద్వారా 500కు పైగా సేవలు అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. సచివాలయ సిబ్బందిని వేర్వేరు సర్వేలకు వినియోగించడం, సిబ్బంది కొరతతో సేవలు నిలిచిపోతున్నాయి. దీనికి తోడు కనీసం సచివాలయాలకు కావలసిన మెటీరియల్ సైతం అందించక పోవడంతో ధ్రువీకరణ పత్రాలు కూడా ఇవ్వడం లేదు. రైతు భరోసా కేంద్రాలకు పేరుమార్చి రైతు సేవా కేంద్రాలుగా మార్చి వదలివేశారు. రైతులకు కనీస సేవలు అందించలేని కేంద్రాలుగా నిలిచిపోయాయి.

ఇంటికే రేషన్ అందించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక గొల్లగూడెం సెంటర్‌లో ఆదివారం దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొత్త వీర్రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మేడపాటి రాఘవేంద్రరావు, గౌరవ అధ్యక్షుడు పులిమి లక్ష్మణరావులు మాట్లాడుతూ సంఘాన్ని జిల్లా స్థాయిలో విస్తరిస్తామని చెప్పారు. దివ్యాంగులకు బస్సులో ఉచిత ప్రయాణం కల్పించాలని, దివ్యాంగులకు రేషన్ ఇంటి వద్దకే సక్రమంగా అందించాలని కోరారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు.



గూడెంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం

పోలీసుల ఆంక్షలు సరికాదు

ఏలూరు (టూటౌన్): ఏజెన్సీ ప్రాంత గిరిజనుల, ప్రజల నోరునొక్కేందుకే పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో పెడుతున్న ఆయుధ డిపోను అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, ఆర్ అండ్ ఆర్‌లో ఎల్‌టీఆర్ భూములు పెట్టవద్దని గిరిజనులు కోరుతున్నారని, టీ.నర్సాపురంలో ఎర్రాలువ మిగులు భూములను దళితులు, పేదలు సాగుకోసం అడుగుతున్నారని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

పాము కాటుకు ఇద్దరు మహిళల మృతి


జెసింత మృతదేహం


కేతా దేవి (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: వేర్వేరు ప్రాంతాల్లో పాము కాటుకు ఇద్దరు మహిళలు బలయ్యారు. పాలకొల్లు మండలంలోని వెలివల గ్రామానికి చెందిన కేతా దేవి (30)శనివారం ఓ తోటలో కలుపు మొక్కలు తీయడానికి వెళ్లింది. అక్కడ పాము కాటుకు గురికాగా స్థానికులు వెంటనే పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం దేవి మృతి చెందింది. ఆమెకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త కేవీ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కూలి పనికి వెళ్లి..

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన తేళ్లూరి జెసింత(45)ఆదివారం ఉదయం కూరగాయల తోటలో కూలి పని చేస్తుండగా పాము కాటుకు గురైంది. ఆమెను చాట్రాయి పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించగా అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే ఆమె మృతి చెందిందని అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. జెసింతకు భర్త, కుమారుడు ఉన్నారు. కాగా చాట్రాయి పీహెచ్‌సీలో సకాలంలో వైద్యం అందించకపోవడం వలనే జెసింత మృతి చెందిందని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

ఏలూరు టౌన్, దెందులూరు: ఏలూరు ఆర్‌టీవో కార్యాలయం సమీపంలోని ఉండవల్లి అపార్టమెంట్‌లో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండవల్లి అపార్టమెంట్స్‌లో ఆశ్రం ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ కే.శైలజ నివాసం ఉంటున్నారు. ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 17న దైవదర్శనం కోసం షిర్డీ వెళ్లారు. తిరిగి 21వ తేదీ ఆదివారం ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ఇంటిలోని రూ.లక్ష నగదు అపహరణకు గురైందని గుర్తించారు. సమాచారం అందుకున్న ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ఏలూరు రూరల్ ఎస్సై జీ.నాగబాబు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏలూరు రూరల్ ఎస్సై నాగబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చాట్రాయి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన చొప్పరపు రాజేష్ (29) ఈ నెల14న భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం మొద్దులగూడెంలో కొబ్బరికాయల దింపు పని నిమిత్తం వెళ్లాడు. చెట్టుపైకి ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: అధిక కట్నం తీసుకురమ్మంటూ వేధిస్తున్న భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముదినేపల్లికి చెందిన షేక్ ఫర్జానాకు ఉయ్యూరు మండలం కాటూరుకు చెందిన కార్తీక్‌తో నాలుగేళ్ల కిందట పరిచయం కాగా పెద్దల అంగీకారం లేకుండా ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కాగా కార్తీక్ భార్యను తరచూ కట్నం తీసుకురాలేదంటూ మానసికంగా, శారీరకంగా వేధిస్తుండడంతో రెండేళ్ల కిందట ఫర్జానా ముదినేపల్లి వచ్చి నివసిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కార్తీక్ ముదినేపల్లి వచ్చి తనను కొట్టడంతో పాటు దూషించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



జర్నలిస్టులపై కేసులు దారుణం



ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై కేసులు పెట్టే స్థాయికి కూటమి ప్రభుత్వం దిగజారిపోయింది. సమస్యల పరిష్కారానికి కృషిచేయాలే కానీ సమస్యను చూపించిన జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం దారుణం. కూటమి నేతల మోసాలు, అక్రమాలు, దాడులు, హింసలను పత్రికల్లో కథనాలుగా ప్రచురిస్తే పాత్రికేయులపై కేసులు పెడుతున్నారంటే ఎంతగా భయపడుతున్నారో అర్థమవుతోంది.

– వెలగల సాయిబాబారెడ్డి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యుడు, తణుకు

అక్రమ కేసులతో వేధించడం సరికాదు



సాక్షి యాజమాన్యంపై కేసులు పెట్టడమంటే కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు బిగిస్తున్నట్లే. పోలీసుల పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయంపై సాక్షిలో కథనం వస్తే పోలీసులు స్వాగతించాల్సింది పోయి, సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై కేసులు పెట్టడం దారుణం. రాసిన కథనాల్లో ఇబ్బందులు, సమస్యలు ఉంటే వివరణ కోరాలి తప్ప ఇలా అక్రమ కేసులు బనాయించి వేధించడం సరికాదు.

– బడుగు అశోక్ బాబు, అడ్వకేట్, జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు

మహిషమ్మకు దసరా శోభ


కొలువైన శ్రీ కోట మహిషాసురమర్ధని అమ్మవారు


ఆలయం లోపల విద్యుద్దీపాలతో అలంకరణ

- నేటినుంచి నూజివీడులో దసరా నవరాత్రులు ప్రారంభం
- 69వ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

నూజివీడు: దసరా ఉత్సవాలకు పట్టణంలోని శ్రీ కోటమహిషాసురమర్ధని అమ్మవారి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే ఇటు పాట్టిశ్రీరాములు బొమ్మ సెంటర్ వరకు, అటు మీసేవా కేంద్రం రోడ్డు వరకు రహదారికి ఇరువైపులా విద్యుద్దీపాలను అలంకరించారు. ఈనెల 22వ తేదీ నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు 69వ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా 22న బాలా త్రిపురసుందరీదేవిగా, 23న శ్రీ గాయత్రీదేవి, 24న శ్రీ అన్నపూర్ణాదేవి 25న శ్రీ కాత్యాయనిదేవి, 26న శ్రీ మహాలక్ష్మిదేవి, 27న శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి, 28న శ్రీ మహాచండీదేవి, 29న శ్రీ సరస్వతీదేవి, 30న శ్రీ దుర్గాదేవి, అక్టోబర్ 1న శ్రీ మహిషాసురమర్ధనిదేవి, 2న శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. ఈ నెల 29న మూలానక్షత్రం రోజున విద్యార్థులచే శ్రీ సరస్వతీదేవి పూజ నిర్వహించను న్నారు. వచ్చేనెల 2వ తేదీన రాత్రి 8 గంటల నుంచి పోలీసు అధికారులతో శమీపూజ నిర్వహించి 10గంటల నుంచి మేళతాళాలు, కోయనృత్యాలు, చిత్రవిచిత్ర వేషాలు, కోలాటాలతో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈఓ అలివేణి పర్యవేక్షిస్తున్నారు.

నవరాత్రి కాంతులు


విద్యుద్దీప వెలుగుల్లో కుంకుళ్లమ్మ ఆలయం


కాంతులీనుతున్న ఆలయ రాజగోపురం

ద్వారకాతిరుమల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం విద్యుద్దీప అలంకారాలతో కనువిందు చేస్తోంది. ఆలయ ప్రధాన రాజగోపురం, పరిసరాలు కాంతులీనుతున్నాయి. రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ తోరణాలు, అమ్మవారి భారీ విద్యుత్ కటౌట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇదిలా ఉంటే గ్రామంలోని చిలుకూరి మహిళలు ప్రతి ఏటా వలె ఉత్సవాల ప్రారంభం ముందురోజు అయిన ఆదివారం రాత్రి కుంకుళ్లమ్మకు పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు, పూలు, పండ్లను సమర్పించారు.

కొల్లేటికోటలో విద్యుత్ ధగధగలు


కొల్లేటికోట పెద్దింట్లమ్మ


దేవస్థానంలో విద్యుత్ దీపాలతో అలంకరణ

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన పరిసరాలు విద్యుత్ దీపాలంకరణలతో కాంతులీనుతున్నాయి. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు చెప్పారు. ఈ నెల 22న శ్రీచక్రార్చన, 23న దేవి ఖడ్గనామ పూజ, 24న ఆవరణపూజ, 25న అష్టోత్తర కలశపూజ, పంచామృతాభిషేకం, పంచగవ్య ప్రాశన, ఖడ్గ నామావళి కుంకుమ పూజ, 26న గులాబీ పుష్పార్చన, 27న చామంతి పూజ, 28న నవ కలశపూజ, 29న పంచామృత, పంచఫల అభిషేకం, 30న సుగంధ పరిమళ ద్రవ్యార్ధన, అక్టోబరు 1న నవమ నవావరణార్ధన, 2న శ్రీలలితా త్రిశధి, సహస్రనామ ఖడ్గమాల పూజ జరుగుతాయని, దీంతోపాటు నిత్యం లలిత సహస్రనామ కుంకుమ పూజ ఉంటుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కంపు కొడుతున్న గూడెం బస్టాండ్


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలిచిన మురుగు నీరు


పేరుకుపోయిన చెత్త


కాంప్లెక్స్ ఆవరణలో అపారిశుధ్య పరిస్థితులు


ఆర్టీసీ డిపో పక్కన నిలిచిన వర్షపు నీరు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ ప్రాంగణంలో ఇటీవల కురిసిన వర్షాలకు అపారిశుధ్య పరిస్థితులు నెలకొన్నాయి. పలు పల్లపు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. వర్షాలు కురిసిన సమయంలో కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం ఉండడం లేదు. కాంప్లెక్స్ వైపు, డిపో గేటు నుంచి డిపోను ఆనుకుని ఉన్న గోడ పక్కగా ఉన్న ఖాళీ స్థలం మురికి కూపంగా ఉంది. అదే ప్రాంతంలో డ్రైవర్లు, కండక్టర్‌లు, ప్రయాణికులు మూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన పెరుగుతోంది. ఇన్ గేటు, అవుట్ గేటు సమీపంలో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఇన్‌గేట్ వైపు, మోటారు సైకిళ్లు నిలిపేందుకు ఏర్పాటు చేసిన స్టాండ్ ముందు భాగంలోను, స్టాండ్ వెనుక వైపు ఆటోలు రిపేర్లు చేసే పాత షాపుల వద్ద ఆవరణ పల్లంగా ఉండటంతో నీరు నిలిచిపోతోంది. తక్షణం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నరసాపురం రూరల్: ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళపై దాడి చేసి ఆమె మెడలో బంగారం అపహరించిన నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నరసాపురం సీఐ దుర్గాప్రసాద్ వెల్లడించారు. మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన బళ్ళ సూర్య ఆదిలక్ష్మి (55) 30 ఏళ్లుగా భర్తను వీడి ఒంటరిగానే జీవిస్తోంది. కొద్దిపాటి మొత్తాలను వడ్డీలకు ఇస్తూ జీవనం సాగిస్తోంది. గ్రామానికి చెందిన మారోజు శ్రీనివాస్ ఆదిలక్ష్మి వద్ద గతంలో రూ.10 వేలు అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో శనివారం తన ఇంటిలో ఉన్న కలపను విక్రయించేందుకు ఆదిలక్ష్మి శ్రీనివాస్‌కు చూపిస్తు ఉండగా అతడు ఆమెపై కర్రతో దాడి చేసి ఆమె మెడలోని బంగారు బొందు, చెవి దిద్దులు లాక్కొని ఇంటి వెనుక భాగం నుంచి పరారయ్యాడు. చుట్టు పక్కలవారు గాయపడిన ఆదిలక్ష్మిని ఆసుపత్రికి తరలించగా బాధితురాలి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం కాళీపట్నం చేపల చెరువు వద్ద నిందితుడు శ్రీనివాస్‌ను ఆరెస్ట్ చేసి, చోరీ సొత్తు రికవరీ చేశామని, నిందితుడిని కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై జి.వాసు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

అయిభీమవరంలో పిడుగుపాటు

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం గ్రామంలో ఆదివారం రాత్రి కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. గ్రామంలోని వత్సవాయి బద్రీరాజ్ ఇంటివద్ద ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగు పడి పెద్ద శబ్దం రావడంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. దీంతో బద్రీరాజ్ ఇంట్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి, ఎలక్ట్రానిక్ గృహోపకరాలు అన్నీ దగ్ధం అయ్యాయి. పిడుగు పడిన విషయాన్ని అగ్నిమాపక అధికారులకు తెలియజేయడంతో హుటాహుటీన ఆ ప్రాంతానికి వెళ్లారు. అప్పటికే వర్షం కురవడంతో కొబ్బరిచెట్టుపై మంటలు ఆరిపోయాయి. కాగా ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులతో ఆకాశం దద్దరిల్లింది. మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల్లో నియామకం


చలగుళ్ల రవిబాబు


ముసునూరి వెంకటేశ్వరరావు


బిరుదుగడ్డ చల్లారావు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శిగా కలరాయున గూడెం సర్పంచ్ చల్లగుళ్ల రవిబాబు, రాష్ట్ర వలంటీర్స్ విభాగం కార్యదర్శిగా నరసన్నపాలెం మాజీ సర్పంచ్ ముసునూరి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పదవి రావడానికి కృషి చేసిన పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పార్లమెంటు ఇన్‌చార్జి కారుమూరి సునీల్, మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా చల్లారావు


ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రామసింగవరంనకు చెందిన బిరుదుగడ్డ చల్లారావు పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు ఈ పదవి దక్కడానికి కారణమైన మాజీ హోం మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనితకు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసుకి చల్లారావు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

ఎరల వాడకం.. రైతులకు లాభం



నూజివీడు: వివిధ పంటలను ఆశించే పురుగుల వల్ల రైతాంగానికి ఏటా తీరని నష్టం వాటిల్లుతోంది. వీటిని అరికట్టేందుకు వేలాది రూపాయలను వెచ్చించి రసాయన మందులను కొనుగోలు చేసి పిచికారీ చేసినా నష్టాన్ని పూర్తిగా అరికట్టలేకపోతున్నాము. ఈ నేపథ్యంలో రైతులు రసాయన మందులపైనే ఆధారపడకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే స్థిరమైన, నాణ్యమైన ఉత్పత్తులను సాధించడానికి వీలవుతుందని నూజివీడు వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు పేర్కొంటున్నారు. ఈ చర్యల్లో భాగంగా ఎరల వినియోగం గురించి రైతులు అవగాహన కలిగి ఉండాలని చెబుతున్నారు. కీటకాల స్వభావం, వాటిని ఆకర్షించే ఎరలు తదితర అంశాలపై వ్యవసాయాధికారి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.


దీపపు ఎర


పసుపురంగు రేకుల ఎర

లింగాకర్షక ఎరలు

పంటలపై వాలే మగ రెక్కల పురుగుల్ని సహజంగా ఆడ రెక్కల పురుగులు ఆకర్షిస్తాయి. దీనికి గాను ఆడ రెక్కల పురుగుల తల, రెక్కలు, కాళ్లు, జననాంగాల నుంచి కొన్ని రసాయనాలను విడుదల చేస్తాయి. ఈ రసాయనాలనే కృత్రిమంగా తయారుచేసి లింగాకర్షక ఎరలుగా రూపొందిస్తున్నారు. ఈ ఎరలు ప్రధానంగా మగ రెక్కల పురుగుల ఉధృతిని అంచనా వేయడానికి ఉపయోగపడతాయి. వీటిని పాలిథిన్ సంచుల్లో, గరటా ఆకారపు పాత్రల్లో ఉంచి పొలం మధ్యలో నాలుగైదు అడుగుల ఎత్తులో కర్రలు పాతి వాటి చివరన ఎరలను ఉంచుతారు. దీని ద్వారా మగపురుగులు వచ్చి సంచుల్లో పడి చనిపోతాయి. వీటి సంఖ్యను ఆధారంగా పురుగుల ఉధృతి ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

దీపపు ఎరలు

గొంగళి పురుగు జాతికి చెందిన రెక్కల పురుగులు, కొన్ని రకాల పెంకు పురుగులు పంటలను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తాయి. వీటిని నాశనం చేసేందుకు తెల్లని కాంతిని విరజిమ్మే విద్యుత్ దీపాల్ని రాత్రిపూట 7 నుంచి 11 గంటల మధ్య పొలంలో అక్కడక్కక్కడా ఏర్పాటు చేస్తే ఈ పురుగులు కాంతికి ఆకర్షితమవుతాయి. వరిలో కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు, చెరకులో పీకపురుగు, కాండం తొలిచే పరుగు, పత్తి, కందిలో కాయతొలిచే పురుగు, వేరుశనగలో ఎర్ర గొంగళి పురుగు, వేరు పురుగు దీపపు ఎరల చేత ఆకర్షింపబడతాయి. సాగుచేసే పంటను బట్టి పొలంలో 1.2 మీటర్ల ఎత్తులో దీపాల్ని ఏర్పాటు చేసుకోవాలి. వాటికింద వెడల్పాటి తొట్టిలో క్రిమిసంహారక మందు కలిపిన నీటిని ఉంచాలి. దీపాల వద్దకు చేరుకునే రెక్కల పురుగులు ఈ విషపు ద్రావణంలో పడి చనిపోతాయి. విద్యుత్ బల్బులు ఏర్పాటు చేసుకోలేని రైతులు రాత్రి సమయంలో సామూహికంగా మంటలువేస్తే రెక్కల పురుగులు అందులో పడి చనిపోతాయి.

ఎర పంటలు

పురుగుల నిర్మూలనకు ఎరపంటలు కూడా బాగా దోహదపడతాయి. పత్తిలో శనగపచ్చ పురుగు నివారణకు బంతి, తలనత్త పురుగు నివారణకు బెండ, పొగాకు లద్దె పురుగు నివారణకు ఆముదం మొక్కలను అక్కడక్కడా వేసుకోవాలి. దీని వల్ల ప్రధాన పంటకు పురగుతాకిడి తగ్గుతుంది. ఎరపంటపైనే పురుగు మందు పిచికారీ చేసి ఆయా పురుగులను తేలికగా నివారించుకోవచ్చు. తద్వారా రైతులకు సస్యరక్షణ నిమిత్తం పెట్టే పెట్టుబడులు కూడా తగ్గుతాయి.

పసుపు రంగు ఎరలు

పత్తి, మినుము, వంగ వంటి పంటలను ఆశించే తెల్లదోమల నిర్మూలనకు, వాటి ఉధృతిని అంచనా వేయడానికి పసుపు రంగు ఎరలు ఉపయోగపడతాయి. తెల్లదోమ జాతి పురుగులు పసుపు రంగుకు ఆకర్షితమవుతాయి. దీనికి గాను రేకులకు పసుపురంగు వేసి వాటికి జిగురు రాసి ఎకరాకు 5 చొప్పున ఏర్పాటు చేసుకుంటే ఈ తెల్లదోమలు రేకుల వద్దకు వచ్చి వాటికి అతుక్కొని చనిపోతాయి. అంతేగాకుండా రేకుల వద్దకు వచ్చే పురుగుల సంఖ్యను బట్టి వాటి తీవ్రతను అంచనా వేయడానికి వీలవుతుంది.


పలగాని చెన్నారావు

గుబ్బల మంగమ్మను దర్శించిన భక్తులు

బుట్టాయగూడెం: మారుమూల అటవీ ప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మ తల్లిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

ఇంటికే ఉచిత వైద్యసేవలు



తణుకులో రోగుల ఇంటికి వెళ్లి వైద్యసేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటికీ ఉచిత వైద్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వైద్యసేవలందించారు. ప్రత్యేక వాహనం ద్వారా తణుకు, మండపాక, వేల్పూరు ప్రాంతాల్లోని 10 మంది రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. కందా వెంకట ప్రభాకరం ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైనవారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

డాక్టర్ బాబ్జీని పరామర్శించిన ఎమ్మెల్సీ రవీంద్రనాథ్



పాలకొల్లులో డాక్టర్ బాబ్జీని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, రాజకుమారి దంపతులు

తణుకు అర్బన్: పాలకొల్లు మాజీ శాసనసభ్యులు డాక్టర్ తటవర్తి సత్యనారాయణ (డాక్టర్ బాబ్జీ) తనయుడు డాక్టర్ అంజన్ అకాల మృతికి ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ వంకా రాజకుమారి దంపతులు సంతాపం తెలిపారు. ఆదివారం వారి నివాసానికి వెళ్లి డాక్టర్ బాబ్జితో పాటు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో పాలకొల్లు చాంబర్ అధ్యక్షుడు కారుమూరి నరసింహారావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.పాపారావు నాయుడు, అత్తిలి లయన్స్ క్లబ్ నాయకులు దాసం బాబ్జి, జోన్ చైర్మన్ పట్నాల వెంకటేశ్వరరావు ఉన్నారు.

దివ్యాంగులకు, వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేత



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఈతకోట తాతాజీ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక టిడ్కో గృహాలు క్రీస్తు సంఘం చర్చి సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు, వృద్ధులకు నిత్యావసర వస్తువులు పాస్టర్ రొక్కాల నాగ బుజ్జి పర్యవేక్షణలో నిర్వహించారు. బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, జిల్లా నాయకులు నరిసే సోమేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, కోట రాంబాబు, కంచుమర్తి నాగేశ్వరరావు, రామగాని సత్యనారాయణ, గణేష్, సింగం జగన్, నాగేశ్వరరావు, నారాయణ, గరగ ప్రసాద్, రాజా, అంజి తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ కళా కేంద్రం సేవలు అభినందనీయం



బీవీఆర్ కళా కేంద్రంలో సంగీత విభావరి నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళా కేంద్రం నిర్వాహకులు బుద్దాల వెంకట రామారావు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం జరిగింది. గౌరవ పురస్కారం ఇంగ్లీషు లెక్చరర్ కోట రామ ప్రసాద్‌కు, కళా పురస్కారంను శాక్సోఫోన్ ప్లేయర్ దుర్గా నాగ శేషుకు, ఆర్థిక సత్కారం నాగ మల్లేశ్వరరావుకు అందజేశారు. సత్కారాలు జరిగాయి. తొలుత కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సిరిమామిళ్ళ పెద్దిరాజు, ఎన్వీ రమణారావు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు మాట్లాడుతూ మండలంలోని చింతపర్రు గ్రామానికి చెందిన అంగర గంగరాజు, చల్లా బత్తుల కోటగంగరాజు, కూర్మా లక్ష్మీలకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున ముప్పై వేలు ఆర్థిక సహాయం అందజేశామని వివరించారు.

వేతనాల కోసం అల్లాడుతున్న ఆయాలు

- మునిసిపల్ పాఠశాలల్లో 4 నెలల వేతన బకాయిలు
- అసలే అరకొర వేతనం.. అదీ ఏ నెలకానెలా ఇవ్వరు
- మునిసిపల్ అధికారులకు ఆయాల వినతులు



తణుకు మునిసిపల్ ప్రాథమిక పాఠశాల

తణుకు అర్బన్: తణుకు మునిసిపల్ పాఠశాలల్లో విధుల్లో ఉన్న ఆయాలు ఆకలికేకలతో అల్లాడుతున్నారు. 4 నెలల కాలంగా వారికి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇళ్లు గడవలేకపోతున్నామని వాపోతున్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలో 17 పాఠశాలలు ఉన్నాయి. అందులో పాఠశాలకు ఒక్కరు చొప్పున 17 మంది మహిళలు ఆయాల రూపంలో పట్టణ పరిధిలోని 34 వార్డుల్లో అందుబాటులో ఉన్నారు. మే నెల నుంచి ఇప్పటివరకు వేతనాలు పెండింగ్‌లో పెట్టడంతో అప్పులు చేసుకుని ఇళ్లు గడపాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల కూడా గడిస్తే 5 నెలలకు బకాయి పెరుగుతుందని ఆవేదన చెందుతున్నారు.

రూ. 4 వేలు వేతనం

మునిసిపల్ పాఠశాలల్లో ఏళ్ల తరబడి విధుల్లో ఉన్న ఆయాలు ఉదయం పిల్లలు రాకుండానే వచ్చి ఆవరణతోపాటు తరగతి గదులు శుభ్రం చేస్తుంటారు. ఇచ్చేది అరకొర వేతనం రూ. 4వేలు అయినప్పటికీ అలవాటుపడిన మహిళలు ఆయాలుగా స్థిరపడి ఏళ్ల తరబడి విధుల్లో ఉంటున్నారు. ఆ వేతనం కూడా ఏ నెలకు ఆనెల ఇవ్వకుండా ఇటీవల కాలంలో 4నెలలపాటు బకాయి పెడుతున్నారని వాపోతున్నారు. ఈ సమస్యపై ఇటీవల తణుకు మునిసిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయాలు ధర్నా నిర్వహించి మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ కార్యాలయ ఉద్యోగులను నిలదీశారు. ఇకపై ఏ నెలకు ఆ నెలలోనే వేతనం ఇప్పించాలని ఆయాలు కోరుతున్నారు. అంతేకాకుండా ఇటీవల పాఠశాలల అప్‌గ్రేడ్‌లో భాగంగా విద్యార్థులు పెరిగిన పాఠశాలల్లో అదనంగా మరొక ఆయాను నియమించాలని వారు కోరుతున్నారు.

ప్రతినెలా సక్రమంగా వేతనాలివ్వాలి



మా వేతనాలు ఏ నెల వేతనం ఆ నెలలోనో, మరుసటి నెల మొదటి వారంలోనే ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏళ్ల తరబడి పాఠశాలల్లో ఆయాలుగా ఉంటూ మా కుటుంబాలను పోషించుకుంటున్నాము. మా కష్టాన్ని గుర్తించి వేతనాన్ని సకాలంలో ఇప్పించాలి. అంతే కాకుండా కనీస వేతనం మాకు ఇప్పించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– పాలాని శారద, మునిసిపల్ పాఠశాల ఆయాల సంఘ కార్యదర్శి

వేతనాలివ్వకపోతే ఏం తినాలి



మునిసిపల్ పాఠశాలల్లో విధుల్లో ఉన్న ఆయాలకు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. అసలే అంతంత మాత్రం వేతనం అది కూడా నెలనెలా ఇవ్వకపోతే వారెలా బతుకుతారు. కార్యాలయంలో ఆడిట్ పూర్తయ్యాక వారి వేతనాల బిల్లులు చేస్తుండడంతో జాప్యం జరుగుతోంది. ఆడిట్‌కు సంబంధం లేకుండా ప్రతి నెలా సక్రమంగా వేతనాలివ్వాలి.

– పీవీ ప్రతాప్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, తణుకు

అల్జీమర్స్ మెదడుపై ప్రభావాన్ని చూపే వ్యాధి



డాక్టర్ రమేష్‌కుమార్‌ను సత్కరించిన దృశ్యం

తణుకు అర్బన్ : అల్జీమర్స్ వ్యాధి మెదడుపై తీవ్ర ప్రభావాన్ని చూపించి జ్ఞాపకశక్తిని హరించే సర్వసాధారణ రోగమే అయినప్పటికీ మానసిక సమస్యలకు దారితీసే ప్రమాదం పొంచి ఉంటుందని సీనియర్ మానసిక వైద్యులు డాక్టర్ బి.రమేష్ కుమార్ అన్నారు. ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు సీనియర్స్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో వృద్ధులకు వయస్సు రీత్యా వచ్చే మతిమరపును రోగాన్ని అల్జీమర్స్‌గా భావించాల్సిందన్నారు. వ్యాధి ముదిరిన సమయంలో మెదడుపై తీవ్ర ప్రభావాన్ని చూపించి మతిమరపుతో గందరగోళ పరిస్థితులు ఏర్పడడమే కాకుండా భావోద్వేగ మార్పులు సంభవించే అవకాశం ఉంటుందన్నారు. జన్యుపరంగా కూడా అల్జీమర్స్ వ్యాధి సంక్రమించే అవకాశం ఉందని, ఊబకాయం, డయాబెటీస్ వంటి వ్యాధులతో ఉన్నవారు నిత్యం నడక, వ్యాయామం చేస్తూ మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ రమేష్‌కుమార్‌ను సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి, సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, కార్యదర్శి ఎండీ స్వాలిహా, కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు ఆకుల వెంకటేశ్వరరావు, అక్కిన బాపినీడు, పరిమి సూర్య నారాయణ, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం



ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని సీనియర్ లయన్ గమిని సుబ్బారావు అన్నారు. కడకట్ల జనత ఆసుపత్రి ఆవరణలో క్లబ్ సేవా కార్యక్రమాలలో భాగంగా పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో ఆదివారం నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. 131 మందికి వైద్య పరీక్షలు చేశారు. 30 మందికి ఉచితంగా కళ్లజోడ్లు పంపిణీ చేశారు. 21 మంది రోగులను మైనర్ ప్రొసీడింగ్స్ నిమిత్తం, 13 మంది ఆపరేషన్లు నిమిత్తం నిడదవోలు కంటి ఆసుపత్రికి తరలించారు. జనత ఆసుపత్రి వైద్యులు ఎల్ ఎస్వీ నాగేశ్వరరావు, అధ్యక్షుడు చిన్నం మణీంద్ర, సెక్రటరీ త్రిమూర్తులు, సుంకర శ్రీనివాస్, చిక్క వెంకటేశ్వరరావు, సోమేశ్వరరావు, జగదీష్, సంపత్‌లు పాల్గొన్నారు.

పెంచిన పని గంటలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్

ఇరగవరం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పనిగంటలు తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.వీ.ప్రతాప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరగవరం మండల కేంద్రంలో సీఐటియూ మహాసభ అంబటి అమరావతి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ మహాసభలో ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాలను 13 గంటలకు పెంచారని ఇది దుర్మార్గమైన చర్యని అన్నారు. ప్రపంచంలో కార్మికులు పని దినాలు తగ్గించాలని వారి ప్రాణ త్యాగాలు చేసి ఎనిమిది గంటల పని దినాలను సాధించుకున్నారని నేడు కార్మిక చట్టాలన్నింటిపీ మార్చేస్తున్నారని వాటి కోసం మనమంతా పోరాటాలు చేయాలన్నారు. సీఐటియూ జిల్లా నాయకురాలు అడ్డగర్ల అజయ్ కుమారి మాట్లాడుతూ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం బానిసలుగా చేస్తుందని అన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అధికారంలోకి వచ్చిన తర్వాత పనిభారాణి పెంచారని దారుణమన్నారు. రాబోయే కాలంలో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కనీస వేతనాలు అమలు, పనిగంటలు తగ్గింపు, వృత్తికి రక్షణ కొరకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సీఐటియూ నాయకులు కామన మునిస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బళ్ల చిన్న వీరభద్రం వివో ఓ జిల్లా నాయకులు వరలక్ష్మి తదితరులు మాట్లాడారు. ఈ మహసభలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సీఐటియూ మండల కన్వీనర్ కమిటీ జుత్తిగ రామాంజనేయులు, కన్వీనర్ జి.విజయ్ కుమారి, కో కన్వీనర్ కమిటీ సభ్యులుగా ఏ. అమరావతి ,ఎన్. రూపావతి, జె .సత్య దేవి ,కే .సత్యవతి, పి.నాగరాజు, జి .బాలకష్ణ, ఎస్ .ఏసు, పి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



తణుకులో డాక్టర్ సతీష్‌ను సత్కరించిన మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని న్యూరో ఫిజీషియన్ డాక్టర్ గుడ్ల సతీష్ అన్నారు. ఆదివారం స్థానిక గమిని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవత సేవలు సమాజంలో కిందిస్థాయి వర్గాలకు చేరువయ్యాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దాత మైనేని సురేఖ అందచేసిన రూ. 5వేలు విరాళాన్ని ఇంటర్మీడియేట్ విద్యార్థిని జి.దివ్య సౌజన్యకు విద్యావసరాల నిమిత్తం అందజేశారు. మానవత సభ్యులు పి.రామచంద్రరావు, బి.రామం, స్వలీహా ముగ్గురు రూ. 5వేలు చొప్పున సంస్థకు విరాళాన్ని ప్రకటించినట్లు మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు తెలిపారు. అనంతరం మానవత సంస్థ తరపున డాక్టర్ సతీష్‌ను సత్కరించారు. రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కె.రాధాపుష్పవతి, జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్మన్ బి.రామలక్ష్మి, ఎస్వీ సతీష్ బాబు, కార్యదర్శి కె.విశ్వనాధరాజు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

పాలకొల్లు సెంట్రల్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. ఆదివారం క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న 13 మందికి కంటి చికిత్సలు చేయించామన్నారు. సుమారు రూ. 60 వేల వ్యయంతో చికిత్సలు చేయించామని స్పష్టం చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి సహాయ సహకారాలు అందించడంలో వాకర్స్ క్లబ్ తన వంతు కృషి చేస్తుందన్నారు.

అభ్యుదయ కవి గురజాడ అప్పారావు



గ్రంథాలయంలో స్వచ్ఛ భారత్



గురజాడ జయంతి వేడుకలో సాహితీ సామ్రాజ్యం ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అభ్యుదయ కవి గురజాడ అప్పారావు అని పలువురు వక్తలు కొనియాడారు. సంఘ సంస్కర్త గురజాడ 163వ జయంతిని ఆదివారం స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహించారు. అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు నాటభాషా వ్యాప్తికి గురజాడ, గిడుగు చేసిన సేవలను కొనియాడారు. వి.జాన్‌బాబు, కేవీ సత్యప్రకాష్, ఏవీ లక్ష్మణరావు, గురజాడ చేసిన సేవలు, గేయాలు, నాటకాలు, గీతాలు, తెలుగువాడి గుండెలలో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఆదిత్య విద్యార్థులచే పరిసరాల పరిశుభ్రత చేశారు. మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ పి.లక్ష్మీసరోజ, డైరక్టర్ శ్రీనవాసరెడ్డి, వి.సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళులు

తణుకు అర్బన్: సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గురజాడ విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ వాడుక భాషకు తొలి జాడ గురజాడ అన్నారు. అనంతరం గురజాడ అప్పారావు జీవిత చరిత్రపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆడిటర్ జొన్నలగడ్డ సూర్య సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. గురజాడ విద్యానికేతన్ ఇన్‌చార్జ్ పాలెపు మమత, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బంగారు రమేష్‌కుమార్, మండవల్లి చినరామయ్య, నండూరి స్యూనారాయణమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో కాగులంపాడు కనకదుర్గమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా మహోత్సవాలు సందర్భంగా పట్టణంలో బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు ఆధ్వర్యంలో విశేష ఏర్పాట్లు చేశారు. ఆలయంలో విశేష అలంకరణలు, విద్యుత్ దీపాలతో అలంకరణలు జరిగాయి. 11 రోజులు పాటు జరిగే విశేష పూజలలో పట్టణ ప్రముఖులు హాజరు కానున్నారు. అమ్మవారిని 22వ తేదీ సోమవారం బాలా త్రిపుర సుందరీదేవిగాను, 23వ తేదీ మంగళవారం గాయత్రిదేవిగాను, 24వ తేదీ బుధవారం కాత్యాయని దేవిగాను, 25వ తేదీ గురువారం మహాలక్ష్మిదేవి, 26వ తేదీ శుక్రవారం అన్నపూర్ణదేవి, 27వ తేదీ శనివారం లలితా త్రిపురసుందరీ దేవి, 28వ తేదీ ఆదివారం మహాచండి దేవి, 29వ తేదీ సోమవారం సరస్వతీదేవి, 30వ తేదీ మంగళవారం వనదుర్గాదేవీ, 1వ తేదీ బుధవారం మహిషాసుర మర్దినీ దేవి, 02వ తేదీ గురువారం రాజరాజేశ్వరిదేవిగా విశేష అలంకరణలు చేయనున్నారు. అదే విధంగా పట్టణంలోని శ్రీ వాసవి కన్యకపరమేశ్వరీ ఆలయంలోను, వీకర్స్‌కాలనీ శ్రీ గాయత్రీ దేవి ఆలయంలోను, శంకరమఠంలోను, శ్రీదేవి మహంకాళమ్మ తల్లి ఆలయంలోను, పాతూరు కనకదుర్గమ్మ ఆలయంలోను, ఇతర ఉత్సవ పందిరిలు వద్ద విశేష ఏర్పాట్లు జరిగాయి. భక్తులు అమ్మవార్లను దర్శించాలని, విశేష పూజలలో పాల్గొనాలని ఆలయ కమిటీలు భక్తులను, ప్రజల జీ కోరారు.

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామివారి ఆలయం, ప్రత్తిపాడు వై. జంక్షన్‌లోని కనకదుర్గమ్మ ఆలయం, కాగులంపాడు రోడ్డులోని అమ్మవారి ఆలయం, మీనవిల్లూరు దేవీ సెంటర్‌లోని దుర్గమ్మ ఆలయం, కొండేపాడులోని దుర్గమ్మ అమ్మవారి ఆలయం, పెంటపాడు, కె. పెంటపాడు, విప్పర్రు తదితర గ్రామాల్లో ఉత్సవాలు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేక చలువ పందిళ్లు వేసారు. ఆయా ఆలయాల వద్ద విద్యుత్ కటౌట్‌లు ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో ఉన్న అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 1, 2 తేదీలలో పాలాభిషేకం, కుంబాభిషేకం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు రాంబాబు తెలిపారు.

గూడెంలో భారీ వర్షం

- పొంగి పొర్లిన డ్రెయిన్‌లు
- ప్రయాణికుల అవస్థలు



పాలూరి వారి వీధిలో మురుగు నీరు



పలు ప్రాంతాల్లో పొంగిన డ్రెయిన్‌లు



3వ వార్డు సచివాలయం రోడ్డులో వర్షపు నీటిలో ఆటలాడుతున్న చిన్నారులు



2వ వార్డు గాయత్రి గుడి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయినేజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో కురిసిన భారీ వర్షానికి డ్రెయిన్‌లు పొంగిపొర్లాయి. డ్రెయిన్‌ల్లో చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు పూడుకుపోవడంతో నీరు ఎటు వెళ్లలేని పరిస్థితిలలో ఆ డ్రెయిన్ మురుగు నీరు రోడ్లపైకి చేరాయి. ఖాళీ స్థలాలు మునిగిపోయాయి. మురుగు డ్రైయిన్‌ల లో నీరు రోడ్లపైకి చేరాయి. పారిశుధ్య కార్మికుల కు సెలువు కావడంతో పట్టణంలో ఎక్కడ చెత్తా అక్కడే ఉంది. అదేవిధంగా వర్షం పడటంతో చెత్తా చెదారాలు డ్రెయిన్‌లలోకి చేరాయి. పాతూరు, కడకట్ల, యాగర్లపల్లి, హౌసింగ్‌బోర్డు, సవిత్ర్యపేట, జువ్వలపాలెం, సత్యవతినగర్, వానపల్లిగూడెం, వీకర్స్‌కాలనీ, దొమ్మర్లకాలనీ, భాగ్యాలక్ష్మీపేట, నవ్వారు పేట, పట్టణ శివారు ప్రాంతాలు, ఇలా అనేక పల్లపు ప్రాంతాలలో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. మునిసిపల్ కార్యాలయం వద్ద, రైల్వేస్టేషన్ రోడ్డు, మసీద్ రోడ్డు, బస్సు కాంప్లెక్స్ ఆవరణ, పలు పల్లపు ప్రాంతాలలోని పాఠశాలల ఆవరణలు నీరు నిలిచిపోయింది.

వర్షంతో తడిసి ముద్దయిన 'గూడెం'

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో పట్టణమంతా తడిసి ముద్దయింది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం సుమారు 45 నిమిషాల పాటు కురిసింది. దీంతో ఆర్టీసీ బస్టాండ్, తాలూకాఫీస్ ప్రాంగణం, పీఆర్ కార్యాలయం, కేఎన్ రోడ్డు వెంబడి వర్షపు నీరు చేరుకుంది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. అయితే, ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేశారు. అంతర్గత రహదారుల్లోకి నీరు చేరడంతో చిన్నారులు వర్షపు నీటిలో కేరింతలు కొడుతూ వర్షాన్ని ఆస్వాదించారు.

కొలనులా తయారైన బస్టాండ్



బస్టాండ్‌లో చెరువులా ఉన్న ప్రయాణికులు కూర్చునే ప్రదేశం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో కొద్దిపాటి వర్షానికే పొట్టి శ్రీరాములు బస్టాండ్ నీట మునుగుతుంది. వర్షం ఏకధాటిగా కురిస్తే మాత్రం బస్టాండ్‌లోకి వెళ్లాలంటే ఈత కొట్టాల్సిందేనని ప్రయాణికులు చెబుతున్నారు. ఆదివారం రాత్రి 7 గంటలకు కురిసిన వర్షానికి బస్టాండ్ జలమయమైంది. కనీసం ప్రయాణికులు కూర్చునే అవకాశం కూడా లేకుండాపోయింది. అలాగే పట్టణంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండ్‌కు ఇన్ గేటు బాగానే ఉన్నా అవుట్ గేట్ మాత్రం నీట మునిగిపోతుంది. బస్టాండ్ లోపలకి వెళ్లాలన్నా లోపల ఉన్న వాళ్లు బయటకు రావాలన్నా కదిలే పరిస్థితి కనిపించడం లేదు. వర్షం గట్టిగా కురిస్తే మాత్రం దాదాపు మోకాలు లోతు వరకూ నీరు చేరుకుంటుంది. దానివల్ల ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం

భీమవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి పూరి గుడి వద్ద ఆదివారం జైన్ సమాజ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు.